సాక్షి అనకాపల్లి

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



సంక్షేమావృద్ధితో సువర్ణపాలన

కె.కోటపాడు మండలంలో రూ.15.51 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. 8లో



ఔషధ మొక్కలపై అవగాహన

సుగంధ మొక్కల పెంపకం, ప్రాథమిక ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. 8లో



20న స్థాయి సంఘ సమావేశం

విశాఖ: జీవీఎంసీ స్థాయి సంఘ సమావేశాన్ని మేయర్ అధ్యక్షతన ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

అనాథ చిన్నారులకు రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్



వేచలంలో చిన్నారులకు చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన వేచలానికి చెందిన ఇద్దరు చిన్నారులను ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంది. తాతయ్య దొడ్డి సోమునాయుడు ఇంట్లో ఉంటున్న చిన్నారులు ఆడారి యశ్విత లక్ష్మి, జాషిత శ్రీ చాతుర్యలకు మంజూరైన రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం అందజేశారు. ఆడారి ప్రసన్న లక్ష్మి, దామోదర్ దంపతులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అనాథలైన ఇద్దరు చిన్నారుల దీన స్థితిని చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఈ చెక్కులను ఇద్దరు చిన్నారుల పేరిట బ్యాంక్ ఖాతాలో వేయించే బాధ్యతను స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడుకు డిప్యూటీ సీఎం అప్పగించారు. వారి చదువుకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి ఎన్నికల శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్

సాక్షి, అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. శనివారం అనకాపల్లి రోటరీ క్లబ్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధి విధానాలను వివరించారు. విధి నిర్వహణలో పోలీసులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా జరిపించేలా ప్రణాళికాబద్ధంగా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇతర శాఖల సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీలు కె.వి.సత్యనారాయణ, వి.సుబ్బరాజు, ట్రెయినీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, గణేష్, కుమారస్వామి, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు మాడుగుల ఎంపీపీగా రాజారామ్ బాధ్యతల స్వీకారం



మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీగా తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన రాజారామ్ ఏదైనా ఉద్యోగం చూడమని జాలంపల్లి గ్రామానికి చెందిన అప్పటి సమితి ప్రెసిడెంట్ బాణం రామన్నదొరను కలిశారు. ఆయన రాజారామ్ మాటతీరు, చురుకుదనం చూసి రాజకీయాలకు పనికివస్తారని తన అనుచరుడిగా తిప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించిన రాజారామ్ బూడి ముత్యాలనాయుడి అనుచరుడిగా వైఎస్సార్‌సీపీలో చేరి ఆయన ప్రతి విజయం వెనుక ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, వైస్ ఎంపీపీగా సేవలందించి, నేడు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు. మండల పరిషత్ ఏర్పడిన తర్వాత పెద్దేరు అవతల 50 గ్రామాల నుంచి వచ్చిన వ్యక్తి ఎంపీపీ కావడం ఇదే ప్రథమం.

నేవీ విన్యాసాల కనువిందు





తీవ్రవాదులను మట్టుపెట్టేందుకు తీరానికి చేరుకున్న కమాండోలు

- మిలాన్ రిహార్సల్స్ ప్రారంభం
- అబ్బురపరిచిన సాహసాలు

బీచ్‌రోడ్డు (విశాఖ): సాగర తీరంలో నేవీ శనివారం నిర్వహించిన మిలాన్ రిహార్సల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. భారీ యుద్ధనౌకలు, స్పీడ్ బోట్లు, ఫైటర్ జెట్స్, యుద్ధ విమానాల సందడి, ప్యారాచూట్లతో నేవీ సిబ్బంది చేసిన విన్యాసాలు వీక్షకులను కట్టిపడేశాయి. తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ప్రతిష్టాత్మక మిలాన్–2024 కార్యక్రమం జరగనుంది. రిహార్సల్స్‌లో వివిధ భద్రతా బలగాల ప్రదర్శనలు మైమరిపించాయి. నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, రాష్ట్ర పోలీసులు, వివిధ బెటాలియన్స్, ఎన్‌సీసీ విద్యార్థుల కవాతు ప్రదర్శన కిలోమీటర్ మేర సాగింది. ఈనెల 22న హార్బర్ ఫేజ్ తుది విన్యాసాలను తిలకించేందుకు ముఖ్యఅతిథులుగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ముఖ్యమమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు.



రక్షణ బలగాల కవాతు



తీవ్రవాదులను హతమార్చిన కమాండోలు



పారాచూట్‌తో కమాండోల డైవింగ్

పార్టీ విజయమే లక్ష్యంగా..



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- 34 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, పరిశీలకులతో సమావేశం
- హాజరైన వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్లు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో గత ఎన్నికల్లో కన్నా ఎక్కువ స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా కృషి చేయాలని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎండాడ లాకాలేజీ సమీపంలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉత్తరాంధ్రలోని పార్టీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ క్షణంలోనైనా ఎన్నికల నగరా మోగనుందని, రానున్న 60 రోజులు చాలా కీలకమన్నారు. రాష్ట్ర ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇందులో ఉత్తరాంధ్ర ప్రజలు ముఖ్య పాత్ర పోషించనున్నారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల సమయంలో బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణకు సంబంధించి మార్గదర్శకం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర, మంత్రులు సీదిరి అప్పలరాజు, డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్లు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, బొడ్డేడ ప్రసాద్, పరీక్షిత్‌రాజు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బెల్లాన చంద్రశేఖర్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబురావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్ రాజ్, గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, బొత్స అప్పలనర్సయ్య, బడుకొండ అప్పలనాయుడు, శంబంగి చినఅప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, కళావతి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, సురేష్‌బాబు, దువ్వాడ శ్రీనివాసరావు, పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, సమన్వయకర్తలు కె.కె రాజు, ఆడారి ఆనంద్, మత్సరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, తలా రాజేష్, ఉరుకూటి రామచంద్రరావు (చందు), మలసాల భరత్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు హాజరయ్యారు.

సీఎం జగన్‌తోనే బీసీలు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు



హాజరైన బీసీ విద్యార్థినులు

- ఆలిండియా బీసీ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు

నర్సీపట్నం: వచ్చే ఎన్నికల్లో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే బీసీల మద్దతు ఉంటుందని ఆలిండియా జ్యోతిబా పూలే బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. బీసీ విద్యార్థులతో శనివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో బీహార్ తర్వాత ఏపీ ప్రభుత్వం కులగణన నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న విద్యా విధానాలు, నాడు–నేడు అభివృద్ధి పనులను మిగతా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు బీసీ సంఘాలు ఐక్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజవర్గాల్లో పర్యటించి సమావేశాల ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నామన్నారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో మళ్లీ సీఎం జగనే అంటూ విద్యార్థినులు నినాదాలు చేశారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

- ప్రధాన జంక్షన్ల వద్ద పోలీసు బందోబస్తు
- రోడ్డు భద్రత మాసోత్సవాల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి , ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: జిల్లాలో పాయకరావుపేట నుంచి విశాఖ వరకు సుదీర్ఘమైన జాతీయ రహదారి ఉందని, ప్రధాన జంక్షన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద 35వ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట, నక్కపల్లి, తాళ్లపాలెం, యలమంచిలి, తోటాడ జంక్షన్ల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, పోలీస్, రెవెన్యూ, జాతీయరహదారి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వాహనాల స్పీడ్‌ను తగ్గించేందుకు బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్ల జరుగుతున్నాయని, వాహన చోదకులు స్పీడ్ తగ్గించి, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ఆయన కోరారు.

ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ రహదారికి వచ్చే రోడ్లపై స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఆర్టీవో కె.వి.ప్రకాష్, డీఎస్పీ వి.సుబ్బరాజు, ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు, జీవీఎంసీ ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించే వారిపై బైండోవర్ కేసులు



నెలవారీ నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

- పాత నేరస్తులపై నిఘా.. అసాంఘిక కార్యకలాపాల కట్టడి
- క్రైం రివ్యూ సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం

సాక్షి, అనకాపల్లి: రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అన్నారు. అల్లర్లు, సమస్యలు సృష్టించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన వివిధ రకాల కేసుల పురోగతిని సమీక్షించి, దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సీఆర్‌పీసీ సెక్షన్లు 107–110 ప్రకారం ఎన్నికల ముందు, ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత అల్లర్లు సృష్టించే వారిని గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతిభ కనబరిచిన 12 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎస్పీ అందజేశారు.

అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ బి.వెంకటరామయ్య, ఎస్పీ డీఎస్పీ బి.అప్పారావు, ట్రెయినీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణం

- గంటన్నర పరీక్ష నిర్వహణపై ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల ఆరా



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సెమిస్టర్ థియరీ పరీక్షను శుక్రవారం గంటన్నర సేపే నిర్వహించడానికి పరీక్ష కేంద్రం నిర్వాహకుల బాధ్యతారాహిత్యం కారణమని ఏయూ పరీక్షల నిర్వహణ విభాగం అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. శుక్రవారం ఏయూ పరిధిలోని పరీక్ష కేంద్రాల్లో ఎక్కడా ఇటువంటి పరిస్థితి ఎదురుకాలేదని, కేవలం యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే పొరపాటు జరిగిందని అధికారుల విచారణలో తేలింది.

మిగతా పరీక్ష కేంద్రాల్లో 3 గంటలు కాలవ్యవధిలోనే పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఏయూ పరీక్షల నియంత్రణాధికారి టి.చిట్టిబాబు సాక్షికి తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాట తప్పిన ప్రిన్సిపాల్

శుక్రవారం జరిగిన పొరపాటును సరిదిద్దుకుంటూ శనివారం మరో గంటన్నరసేపు పరీక్ష పెడతామని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ విద్యార్థులకు శుక్రవారం హామీ ఇచ్చారు. అయితే అలా జరగకపోవడంతో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను కలిసి పరీక్ష పెట్టమని కోరారు. ఈ విషయంపై మీడియాలో కథనాలు రావడంతో రెండోసారి పరీక్ష నిర్వహించడం కుదరదని ప్రిన్సిపాల్ తేల్చిచెప్పేశారు. యూనివర్సిటీ అధికారుల నిర్ణయం మేరకు నడుచుకుంటామన్నారు.

శనివారం నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఇపుడు ఇలా మాట్లాడుతున్నారేమిటని విద్యార్థి సంఘం నేతలు పరీక్ష కేంద్రం వద్ద నిరసనకు దిగారు.

అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి తమకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం



తుమ్మపాల: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మండల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం అన్ని మండలాల ఎంపీడీవోలు, జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ గ్రాంట్ల కింద విడుదలైన నిధులతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలన్నారు. ఇతర గ్రాంట్ల కింద విడుదలైన నిధులను మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు వినియోగించి అవసరమైన పనులు జరిపించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ రాక ముందే అన్ని పనులను పూర్తిచేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, ఈఆర్‌వోల సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ పనులు, ఎన్నికల పనులను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఎల్‌డీవో అరుణశ్రీ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, డ్వామా పీడీ ఈ.సందీప్, డీపీవో ఆర్.శిరీష రాణి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రంలో సువర్ణపాలన

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- 10 గ్రామాల్లో రూ.15.51 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

కె.కోటపాడు : సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో ప్రజలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి సువర్ణపాలన అందించారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని పది గ్రామాల్లో రూ.15.51 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన డిప్యూటీ సీఎం బూడికి ఆయా గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హారతులిచ్చి, కోలాటాలతో ఘనస్వాగతం పలికారు. పండగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఎ.భీమవరం కాటా వద్ద, మేడిచర్ల గ్రామంలో రూ.1.8 కోట్లతో నిర్మించిన రెండు మంచినీటి పథకాలతో పాటు సీసీ రోడ్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. అనంతరం రొంగలినాయుడుపాలెం, గొర్రుపోటువానిపాలెంలలో రూ.1.03 కోట్లతో నిర్మించిన మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు, సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాలను ప్రారంభించారు. రూ.2.40 కోట్లతో మల్లంపాలెం–చౌడువాడ మధ్య చిట్టిగెడ్డపై చేపట్టిన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు, రూ.4.87కోట్లతో నిర్మించిన శివాలయం వద్ద సామాజిక భవనం, రెండు సచివాలయాలు, రెండు ఆర్బీకే భవనాలతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. మల్లంపాలెంలో రూ.67లక్షలతో నిర్మించిన మంచినీటి పైప్‌లైన్, సీసీ రోడ్లు, పాచిలవానిపాలెంలో రూ.80 లక్షలతో



దాలివలసలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మేడిచర్లలో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

నిర్మించిన మంచినీటి పథకం, పైప్‌లైన్, సీసీ రోడ్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఆర్లి గ్రామంలో రూ.85లక్షలతో నిర్మించిన మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు, సచివాలయం, హెల్త్‌వెల్‌నెస్ భవనాలు, దాలివలసలో రూ.1.16 కోట్లతో నిర్మించిన మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు, సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ భవనాలను, పిండ్రంగిలో రూ.1.26 కోట్లతో నిర్మించిన మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు, సచివాలయం, పాతవలసలో రూ.60 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిల ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే ప్రజలకు సకాలంలో పలు సేవలు అందడంతో పాటు రైతులకు ఆర్బీకేల ద్వారా మెరుగైన సేవలందుతున్నాయని చెప్పారు. హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా సకాలంలో మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందనున్నట్టు ఆయన తెలిపారు. హామీలతో ప్రజలను వంచించే చంద్రబాబు మాయ మాటలను విశ్వసించకూడదని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రజలను కోరారు. ఇంత పెద్ద ఎత్తున గ్రామాల్లో అభివృద్ధికి తోడ్పాటును అందించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అండగా నిలవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, కర్రి సత్యం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, ఏఈలు పూసర్ల రామ్మూర్తి, బాలాజీ అప్పారావు, అల్లు శ్వేత, జి.లక్ష్మణరావు, ఎంపీడీవో అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ చైర్మన్ ఆకుల సాయి ప్రసాద్, విశాఖ డెయిరీ డైరెక్టర్లు సుందరపు గంగాధర్, శీరంరెడ్డి సూర్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు పైల పైడితల్లమ్మ, గొర్రుపోటు రామలక్ష్మి, దాట్ల తాతరాజు, బోళెం సందీప్, కృష్ణారావు, భూమిరెడ్డి దేముళ్ళు, ఆదిరెడ్డి రామునాయుడు, జాగరపు వెంకట రామలక్ష్మి, వేచలపు దొరబాబు, నెక్కల గోపి, చీపురపల్లి అచ్చిబాబు, వర్రి రామునాయుడు, గొర్రుపోటు వెంకటరావు, జామి బుచ్చిరాజు, దాడి ఎరుకునాయుడు, జామి శ్రావణ్, పంచాయితీ కార్యదర్శిలు ఎస్.రామునాయుడు, ప్రశాంత్, కె.భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



చౌడువాడ సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

బాల్యవివాహాలతో అనర్థాలు

చీడికాడ: బాల్యవివాహాల వల్ల ఎన్నో అనర్థాలు తలెత్తుతాయని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత వివాహాలు చేయాలని సూచించారు. స్థానిక ఎంపీపీ కురచా జయమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మాడుగుల ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ శ్రీదేవి, సూపర్‌వైజర్లు పి.చిన్నమ్ములు, వి.ఈశ్వరి, జి.వి.రమణి, స్థానిక ఎంపీడీవో కార్యాలయం పర్యవేక్షకులు కామేశ్వరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనంతలక్ష్మి

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: ప్రజా సంక్షేమ ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణ ధర్మశ్రీ తెలిపారు. గత ప్రభుత్వాలు అప్పులతో రాష్ట్రాన్ని అప్పగించాయని, కరోనా కారణంగా రెండు సంవత్సరాలు తీవ్ర ఇబ్బందులకు గురైనా ప్రజలకు మేలు చేయాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిరాటంకంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. మండలంలో కంచుగుమల గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనం, బీసీ కాలనీలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో పూర్తి చేసిన సామాజిక భవనాన్ని శనివారం ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ వద్దాది సతీష్, స్థానిక నాయకులతో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ నియోజవర్గంలో పలు రామాలయాలకు టీటీడీ నిధులు మంజూరు మంజూరు చేసిందని చెప్పారు. కంచుగుమల సత్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, మడ్డు అప్పలనాయుడు, పాచిలి రామకృష్ణ, బోళెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ఔషధ మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట: ఔషధ, సుగంధ మొక్కల పెంపకం, ప్రాథమిక ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్ తదితర అంశాలపై కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శనివారం విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పించారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.డి.కిరణ్ బాబు, సీనియర్ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ జె.కోటేశ్‌కుమార్, డాక్టర్ వి.ఎస్.ఎస్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ టెక్నికల్ అధికారి కృష్ణ వంశీ పలు అంశాలు తెలియజేశారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.డి.కిరణ్ బాబు మాట్లాడుతూ సుగంధ మొక్కల నుంచి వచ్చే నూనె విక్రయం ద్వారా రైతులు చక్కని ఆదాయం పొందవచ్చని, మిటమిన్ -ఎకి సంబంధించిన ఔషధాల్లో ఈనూనెను వినియోగిస్తారని తెలిపారు. జంతువులు, కీటకాలు ఈ పంటలను ఏ విధంగాను నాశనం చేయలేవని తెలిపారు. కొబ్బరి తోటల్లో 40 శాతం సూర్యరశ్మి తగిలేటట్టుగా ఈ మొక్కలను అంతర పంటగా వేసుకోవచ్చని సూచించారు. నిమ్మగడ్డి, కాశగడ్డి (పామరోజ), యూ కలిప్టస్ సిట్రోడోరా, వట్టివేరు, కృష్ణతులసి, కలబంద, అశ్వగంధ తదితర మొక్కలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ జె.కోటేశ్‌కుమార్ మాట్లాడుతూ ఔషధ, సుగంధ మొక్కల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్త కె.వి.ఎస్.ఎస్. శ్రీనివాస్ మార్కెటింగ్ పరిస్థితులపై అవగాహన కల్పించారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్. వి.కె.నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి నరేంద్రబాబు, చిత్రపు వాసుదేవరావు, దేవవరపు ఆనంద్, రావు జగ్గారావు, డి.కిరణ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

యకోహామా గేటు వద్ద ఘర్షణ

అచ్యుతాపురం: స్థానిక సెజ్‌లోని యకోహామా గేటు వద్ద రెండు వర్గాల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. యకోహామాలో ఉన్న మట్టిని తరలించేందుకు ఓ కాంట్రాక్టర్ బిడ్ వేసి, అనుమతి పొందారు. ఆ మట్టిని సమీపంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆయన తరలిస్తుండగా స్థానికులు కొందరు అడ్డగించారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది.ఈ అంశం ఎస్పీ దృష్టికి వెళ్లినట్టు సమాచారం.

క్లుప్తంగా

గౌరీపరమేశ్వరుల 189వ ఊంజల్ సేవ



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న మళ్ల అప్పారావు రవిరాజ్, అరుణ కుటుంబసభ్యులు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవస్థానంలో శుక్రవారం రాత్రి గౌరీపరమేశ్వరుల 189వ ఉంజల్‌సేవ కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, శేషు,సాయిలు ఆధ్వర్యంలో మళ్ల అప్పారావు రవిరాజ్ అరుణ కుటుంబ సభ్యులు ఉంజల్ సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ, రాత్రికి టిఫిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, పాలక వర్గ సభ్యులు, శ్రీగౌరీగీత మహిళా మండలి, సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీపరమేశ్వరి అమృతవర్షిని సభ్యులు పాల్గొన్నారు.

తీడ సచివాలయం పరిధిలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి

కశింకోట : తీడ సచివాలయ పరిధిలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇచ్చిన స్థలాలకు ఉచిత రిజిస్ట్రేషన్ పూర్తయినట్టు కార్యదర్శి ఎస్.రత్నం శనివారం తెలిపారు. సచివాలయ పరిధిలోని తీడ, చెరకాం పంచాయతీల్లో 145 మందికి ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించి సచివాలయ సిబ్బంది సహకారంతో రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేశామన్నారు.

ఎన్టీఆర్ క్రీడామైదానంలో రూ.50 లక్షలతో కొత్త జిమ్

అనకాపల్లి : ఎన్టీఆర్ క్రీడామైదానంలో జిమ్ నిర్మాణానికి జీవీఎంసీ నిధులు రూ.50 లక్షలు విడుదలయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారుగా రూ.14లక్షల వ్యయంతో స్టేడియంలో గ్యాలరీలు, తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. నిత్యం వేలాదిమంది మైదానంలో ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్ చేస్తున్నారని, ఇటీవల కాలంలో ప్రధాన కమిషనర్ సాయికాంత్ వర్మ, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి సహకారంలో దశల వారిగా క్రీడామైదానాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. మైదానానికి వచ్చే ప్రజలకు వ్యాయామం చేసుకునేందుకు జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 6,624 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,650
మొదటి రకం	3,610	4,240
రెండో రకం	3,380	3,740
మూడోరకం	3,330	3,460

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
నాగద్వీపం (తెలుగు)	: సత్యనారాయణస్క్రీన్-1
మేడెన్ వెబ్(రెండు షోలు)	: సత్యనారాయణ స్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	: పర్తిసాయి
ఓయ్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 110 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-37 యూనిట్లు, బీ పాజిటివ్-41 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 424 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 374 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

డిప్లొమాతో ఉపాధికి భరోసా

- ఉద్యోగాల కల్పనకు కేరాఫ్‌గా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- సాంకేతిక విద్యతో ఉన్నతమైన కొలువులు
- ఏడాదికి రూ.లక్షల ప్యాకేజితో ఉద్యోగాలు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

తుమ్మపాల : ఉద్యోగ అవకాశాల కల్పనకు కేరాఫ్‌గా మండలంలో రేబాక గ్రామంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తయారైంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థిని ఉద్యోగంతో పంపించాలనే లక్ష్యం దిశగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల పనితీరు మారింది. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా సి.నాగరాణి (ఐఏఎస్)బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు సుమారుగా 6 వేలకు పైగా ఉద్యోగాల కల్పన జరిగింది. ఆమె ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు ఉపాధి అవకాశాలతో పాటు కళాశాలల్లో ఆధునిక టెక్నాలజీ గల ల్యాబ్, కంప్యూటర్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. ఉద్యోగాల కల్పనకు తగిన విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ప్రై వేటు కళాశాలల కన్నా మరింత దీటుగా ప్రభుత్వ సాంకేతిక కళాశాలలు పోటీ పడుతు విద్యార్థులకు డిప్లొమాతోనే ఉద్యోగం అందిస్తున్నాయి.

అనతి కాలంలోనే అభివృద్ధి చెంది నూతన జిల్లా కేంద్రం అనకాపల్లి మండలంలో ఉన్న ఈ కళాశాల విద్యార్థుల భవితకు భరోసాగా నిలుస్తుంది. అధునాతన భవనాలు, సువిశాల వాతవరణంతో నిర్మింతమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాలోని అన్ని ప్రాంతాలతో పాటు, విశాఖ జిల్లా నుంచి సైతం విద్యార్థులు వస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఎల్లప్పుడు అధ్యాపకుల ప్రత్యేక దృష్టితో విద్యార్థులను వ్యక్తిగత నైపుణ్యంపై శిక్షణ, కమ్యూనికేషన్స్ వంటి అన్నింటిలోను ముందంజలో ఉండేవిధంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో కళాశాల గడిచిన ఏడాదిలో ఎన్‌బీఏ గుర్తింపు కూడా పొందింది.

సీఈసీలో 2023 ఏడాదికి గాను 63 మంది విద్యార్థుల్లో 58 మంది ఉద్యోగాలు పొందారు. వీరిలో 37 మంది వీల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ, 8 మంది ఎఫ్ట్రోనిక్స్, సమీర్‌లో 5, టెక్నిక్స్‌లో 5, విప్రోలో 2, స్మార్ట్ టీవీ టెక్‌లో ఒకరు చొప్పున ఉద్యోగాలు పొందారు. వీరిలో కొందరు రెండు, మూడు కంపెనీలలో కూడా ఎంపికయ్యారు. ఆయా కంపెనీలతో పాటు డైకిన్, మేథో సర్వో డ్రైవ్స్, హెచ్‌ఎల్ మేండో కంపెనీల్లో కూడా ఇంటర్వ్యూలకు హాజరై ఎంపికైన వారు ఉన్నారు. వారి వివరాలు త్వరలో రానున్నాయి. వీరితో పాటు డిప్లొమా చివర సెమిస్టర్‌లో జరిగే ట్రైనింగ్‌లో కూడా విద్యార్థులకు నెలకు రూ.22 వేలు అందించే కంపెనీలతో కళాశాలలు ఒప్పందాలు చేస్తున్నాయి.

ఏడాదికి రూ.8 లక్షల జీతం



నా పేరు మరిసా ప్రజ్ఞ, నేను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్నాను. మా కళాశాలలో అన్ని విధాలైన సౌకర్యాలు అందిస్తున్నారు. చదువుతో పాటు ఉద్యోగం పొందే పలు కోర్సులపై శిక్షణ అందించి నైపుణ్యం పెంపొందించారు. దీంతో ఇటీవల జరిగిన ఇంటర్వ్యూల్లో బెంగుళూరుకు చెందిన త్వాట్ వర్క్స్ కంపెనీలో క్వాలిఫై అయ్యాను. ఏడాదికి రూ.8 లక్షల ప్యాకేజితో ఎంపికై నట్టు నియామక పత్రం పంపించారు. – మరిసా ప్రజ్ఞ

ఏడాదికి రూ.8.6 లక్షలతో ఉద్యోగం



నా పేరు రాయి ఉమామహేష్. ఈసీ చివరి సంవత్సరం చదువుతున్నాను. ఎన్‌బీఏ అక్రిడెటెడ్ కళాశాల కావడంతో గతంలో ఉన్న సౌకర్యాలతో పాటు మరిన్ని వసతులు మాకు అందుతున్నాయి. మాకు చదువుతో పాటు ప్రాక్టికల్స్‌పై కూడా ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. అధ్యాపకుల ప్రత్యేక చొరవ కారణంగానే మేము మంచి స్థానం పొందాం. టెక్సాస్ కంపెనీలో ఏడాదికి రూ.8.6 లక్షల ప్యాకేజితో ఉద్యోగం పొందాను. చాలా ఆనందంగా ఉంది. –రాయి ఉమా మహేష్

డిప్లొమాతో ఉన్నతమైన కొలువులు



మా కళాశాలలో చదివే ప్రతి విద్యార్థిని కొలువుతో బయటకు పంపించాలనేదే మా లక్ష్యంగా పెట్టుకున్నాం. కమిషనర్ సి.నాగరాణి సహకారంతో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందించగలుగుతున్నాం. ఈ ఏడాది అత్యధికమైన జీతాలతో (ఏడాదికి రూ.8 నుంచి 8.6 లక్షల) ఐదుగురు పిల్లలు ఎంపికయ్యారు. మిగిలిన విద్యార్థులు కూడా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు.

–ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

రూ.38 లక్షలతో ఎల్లయ్య కాలువపై బ్రిడ్జి పనులు



బ్రిడ్జి నిర్మాణపనులు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణమండపం ఎల్లయ్యకాలువపై జీవీఎంసీ రూ.38లక్షల నిధులతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభించడం జరిగిందని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మీ చెప్పారు. శనివారం బ్రిడ్జి నిర్మాణపనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వార్డులో ప్రజలకు మౌలికసదుపాయాలు కల్పించడంతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో రహదారులు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు, తాగునీటి కుళాయిలు, ప్రధాన జంక్షన్లు వద్ద విద్యుత్ రింగ్‌పోల్స్ నిర్మించడం జరిగిందన్నారు. వేల్పులవీధి జంక్షన్ వద్ద బ్రిడ్జి శిధిలావ్యవస్థకు చేరుకోవడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, వివిధ ప్రాంతాల ప్రజలు కల్యాణమండపంలో వివాహాలు చేసుకునే సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడేదని ఆమె తెలిపారు. రూ.38 లక్షలతో బ్రిడ్జిని భారీ వాహనం వెళ్లే విధంగా వెడల్పుచేసి నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, పార్టీ నేతలు, వేల్పుల గణేష్, మద్దాల రమణబాబు, కొంకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

హత్య కేసు విచారణలో జాప్యంపై ఫిర్యాదు



ఎస్ఐ ప్రసాదరావుకు ఫిర్యాదు చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

మునగపాక : తన భర్త హత్యకు కారకులైన దోషులను శిక్షించాలని కోరుతూ భార్య యల్లపు శిరీషా శనివారం మునగపాక ఎస్ఐ ప్రసాదరావుకు ఫిర్యాదు చేశారు. 2022 అక్టోబర్ 12న తన భర్త యల్లపు మహలక్ష్మినాయుడు హత్యకు గురయ్యారన్నారు. నాటి నుంచి పోలీసులు విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. అలాగే పోస్టుమార్టం సమయంలో మహలక్ష్మినాయుడుకు సంబంధించిన వస్తువులను తీసుకొని ఇంతవరకు అందజేయలేదన్నారు. అన్ని ఆధారాలు ఉన్నా పోలీసులు దోషులపై చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తన భర్త మహలక్ష్మినాయుడు హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. వినతి అందజేసిన వారిలో యల్లపు భాస్కరరావు, షేక్ ఇస్మాయిల్, ఎరుకునాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఆలయ శంకుస్థాపనకు తరలిరండి



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : మునగపాకలో ఈ నెల 19న నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపనకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల నాటి కల త్వరలో నెరవేరుతుందన్నారు. గ్రామస్తులంతా ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆలయానికి ప్రతి ఒక్కరూ విరాళం అందజేయాలన్నారు. ఆదేరోజు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఇద్దరు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

ఎస్.రాయవరం : మండలంలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఇరువురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. మండల కేంద్రం ఎస్.రాయవరం బాలికల ఉన్నత పాఠశాల నుంచి వై.జీవిత, గుడివాడ ఉన్నత పాఠశాల నుంచి ఎస్.రాఘవేంద్ర ఎంపికై నట్టు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విద్యార్థులు అనకాపల్లి ఉడ్‌పేటలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ మెమెంటోలు అందజేశారు. ఈ మేరకు మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ చోడిశెట్టి సత్యనారాయణలు అభినందనలు తెలిపారు.

మునగపాక ఎస్ఐకు ప్రశంసాపత్రం



జిల్లా ఎస్పీ మురళీకృష్ణ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక : మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు శనివారం అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న ప్రసాదరావు సేవలను గుర్తించి అనకాపల్లిలో జరిగిన క్రైమ్ మీటింగ్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ అందరి సహకారంతో మునగపాక మండల ప్రజలకు మెరుగైన సేవలందిస్తానన్నారు.

పోక్సో యాక్టుపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి : మహిళలు పోక్సో యాక్టుపై అవగాహన కలిగి ఉండాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య సూచించారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయసముదాయంలో శనివారం మహిళలకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చాలామంది చట్టాలను ఉపయోగించుకోవడంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మహిళారక్షణకు అనేక చట్టాలను ప్రవేశపెట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ప్రదీపా, రెండో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి విజయలక్ష్మి, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ లక్ష్మణ్, కార్యదర్శి సూర శ్రీనివాస్, మహిళలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌షెప్పర్డ్ పాఠశాల వార్షికోత్సవం



అల్లూరి సీతారామరాజు నృత్య ప్రదర్శన

అనకాపల్లి: స్థానిక దాసరిగెడ్డరోడ్డులో గుడ్‌షెప్పర్డ్ స్కూల్ 46వ వార్షిక వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.

లాభసాటి వ్యవసాయం లక్ష్యంగా పనిచేయాలి

రాంబిల్లి : లాభసాటి వ్యవసాయం లక్ష్యంగా శాస్త్రవేత్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సహాయ సంచాలకుడు డాక్టర్ ముకుందరావు అన్నారు. హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) లో శనివారం బీసీటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రావు అధ్యక్షతన శాస్త్రీయ సలహా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముకుందరావు మాట్లాడుతూ, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. గ్రామస్థాయిలోనే నూతన రకాల విత్తనోత్పత్తి పెంచడం ద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. జీవ నియంత్రణ, సేంద్రియ విధానాలు ప్రోత్సహించాలని , గ్రామీణ యువతను లాభసాటి వ్యవసాయం వైపు మళ్లించేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని తీర్మానించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ పీవీకె జగన్నాధరావు మాట్లాడుతూ, యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చునన్నారు. కేవీకే ద్వారా గత సంవత్సరం పాటు చేపట్టిన కార్యక్రమాలను రాబోయే సంవత్సరంకు సంబందించి చేపట్టబోయే కార్యక్రమాలను కేవీకే హెడ్ డాక్టర్ శైలజ, శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి పరిశోధన స్థానం సహ సంచాలకులు సురేష్‌కుమార్, విస్తరణ శాస్త్రవేత్త మోహన్, నువ్వుల పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కుమారితో పాటు పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన రథసప్తమి వేడుకలు



రాజుపాలెం గ్రామంలో మందుగుండు సామగ్రిని వెలిగిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



బాణసంచా కాంతులు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి : జీవీఎంసీ విలీనగ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి, సుంకరమెట్ట జంక్షన్‌లో సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసాయి. స్వామివారిని రాత్రి 9 గంటల వరకూ భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన స్టేజ్ పొగ్రాంలు, నేలవేషాలు, బుర్రకథలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ మందుగుండు సామగ్రిని ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా డీఎస్పీ వి.సుబ్బరాజు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల ఛైర్మన్లు కొణతాల బాబురావు, కె.ఎం.నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జల సంఘాలు సమర్ధవంతంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా సమన్వయకర్త పుల్లయ్య

కశింకోట: స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన జల సంఘాలు తమ బాధ్యతలు, నిర్వహణ గురించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా సమన్వయకర్త పుల్లయ్య కోరారు. కశింకోటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జల సంఘాల నిర్వహణ, బాధ్యతలపై శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల గ్రామాల్లో జల జీవన్ మిషన్ కింద ఉచితంగా ఇస్తున్న ఇంటింటి కుళాయి కనెక్షన్ల నుంచి అందించే తాగునీటి సరఫరా నిర్వహణ బాధ్యతలను పంచాయతీల నుంచి ఇకపై జల సంఘాలకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. దీనివల్ల పారదర్శకంగా నీటిని సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. జల సంఘంలో 11 మంది సభ్యులు ఉంటారని, వీరిలో 9 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు ఉంటారన్నారు. వారితో బ్యాంకు ఖాతా తెరచి సంఘానికి వచ్చిన నిధుల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటికే 16 జల సంఘాలను స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో అధికారులతో కలిపి ఏర్పాటు చేశామన్నారు. సమర్ధవంతంగా సంఘాలు నీటి సరఫరా బాధ్యతను నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పావని, ఏరియా కో-ఆర్డినేటర్ వి.ధర్మారావు, మండల మహిళా సామాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి నాగలక్ష్మి, కోశాధికారి పార్వతి, ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, సీసీలు సత్యనారాయణ, అనురాధ, శ్రీను, రామకృష్ణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల నిరసన



ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అనకాపల్లి : స్థానిక ఆచార్య ఎన్.జి రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు వర్కర్స్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్ అన్నారు. ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం వద్ద శనివారం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్మికులు మరణిస్తే సహజ మరణానికి రూ. 2లక్షలు, ప్రమాదశాత్తూ మరణిస్తే రూ.5లక్షలు కుటుంబసభ్యులు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు లేబర్‌యాక్టులు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో కొణతాల సంతోష్ కుమార్, ఇసరపు లక్ష్మి, మళ్ల లక్ష్మి, నక్కా మంగాదేవి, పల్లా రమాదేవి, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

రూ.కోటి వ్యయంతో జోరుగా కల్యాణ మండపం పనులు





కన్నూరుపాలెంలో నిర్మించిన కల్యాణ మండపం, ప్రవేశ ద్వారానికి అమర్చిన తలుపులు

కశింకోట : కన్నూరుపాలెంలో విశాఖ డెయిరీ సహకారంతో సుమారు రూ.కోటితో కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. సుమారు 3 వేల మంది పైబడిన గ్రామంలో కల్యాణ మండపం లేదు. దీంతో వివాహాది శుభకార్యాలు జరిపించుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో కల్యాణ మండపాన్ని డెయిరీ సహకారంతో నిర్మించారు. చుట్టూ నీడ కోసం రేకుల షెడ్డును నిర్మించారు. దాదాపు పూర్తయింది. తుది మెరుగులు పూర్తి చేసి త్వరలోనే ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

రూ.5 లక్షలతో తాగునీటి ట్యాంకు మరమ్మతులు



వాటర్‌ట్యాంక్ మరమ్మతు పనులకు భూమిపూజ చేస్తున్న కొణతాల భాస్కర్

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో జోరుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కర్ అన్నారు. 80వ వార్డు పరిధిలో జీవీఎంసీ గవరపాలెం చాకలిపేటలో రూ.5లక్షలతో మినీవాటర్ ట్యాంక్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీవాటర్ ట్యాంక్ మరమ్మతులు, ట్యాంక్ క్లీనింగ్, కొత్తపైపులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. 15 రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ వాటర్‌సప్లయ్ ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది అప్పారావు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

యలమంచిలి రూరల్ : కొక్కిరాపల్లి రైల్వే గేటు వద్ద నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న ఫ్లై ఓవర్ పనులను ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ నెల 22న రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాతో వంతెన ప్రారంభోత్సవం చేయించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. డిఈఈ, ఏఈఈలు కాంట్రాక్టు పనులు చేపడుతున్న సంస్థ పర్యవేక్షకులతో ఎమ్మెల్యే పనుల పురోగతి, మిగుల పనుల పూర్తికి ఎంత సమయం పడుతుందన్న విషయాలపై ఆరా తీశారు. వంతెన వినియోగంలోకి వచ్చి ఇక్కడి ప్రజల కష్టాలు తీరితే తనకు సంతృప్తిగా ఉంటుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్, పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.